


> మీ నాయిన తెలంగాణ రాష్ట్రం కోసం చనిపోయినప్పుడు మీరు చిన్న పిల్లలు..
> మీ అమ్మ మిమ్మల్ని ఎంతో కష్టపడి సాదుకున్నది..
> చదివించింది..
> ఇప్పుడు మీరు ప్రయోజకులయ్యారు...
> అమ్మకు ఏకష్టం రాకుండా చూసుకోవాలి
> మీకు ఏ సమయంలోనైనా నా సహకారం ఉంటుంది..
> - కిష్టయ్య పిల్లలతో
> తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్

# అమరుని కుటుంబానికి అండగా..

- కానిస్టేబుల్ కిష్టయ్య బిడ్డ వైద్యవిద్య కోసం కేసీఆర్ ఆర్థిక సహాయం
- రూ.24లక్షల చెక్కు అందజేసిన గులాబీ బాస్
- కిష్టయ్య కుటుంబంతో కలిసి భోజనం



కేసీఆర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న పోలీసు కిష్టయ్య కొడుకు, కుమార్తె

**రాష్ట్ర సాధన కోసం** తన ప్రాణాలను అర్పించిన అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ మరోసారి అండగా నిలిచారు. కిష్టయ్య ప్రాణత్యాగంతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి తానున్నానని ఆనాడే మాట ఇచ్చిన కేసీఆర్.. తన మాటను నిలుపుకొంటూ వస్తున్నారు. కిష్టయ్య కొడుకు, కూతురు చదువుతో సహా కష్టకాలంలో అండగా నిలుస్తూ వచ్చారు. కిష్టయ్య బిడ్డ ఎంబీబీఎస్ చదువు కోసం అవసరమైన ఆర్థిక సహాయం అందించారు. ఎంబీబీఎస్ పూర్తిచేసుకున్న కిష్టయ్య బిడ్డ ప్రియాంక ప్రస్తుతం పీజీ చదువుతున్నది. అందుకు మెడికల్ కాలేజీలో కట్టాల్సిన ఫీజు కోసం కావాల్సిన రూ.24లక్షల చెక్కును ఆదివారం కిష్టయ్య కుటుంబానికి కేసీఆర్ అందజేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కిష్టయ్య కొడుకు రాహుల్ చేస్తున్న ఉద్యోగం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా తమ కుటుంబాన్ని ఇంటి పెద్దలా ఆదుకుంటున్న కేసీఆర్‌కు కిష్టయ్య కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

– కామారెడ్డి, జూన్ 2

### తండ్రిలాంటి కేసీఆర్ ఆదుకున్నాడు...



నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరి పదేండ్లు పూర్తయ్యింది. మా నుంచి పోలీసు కానిస్టేబుల్ కిష్టయ్య (నా భర్త) దూరమై 15ఏండ్లు గడిచిపోయాయి. ఆనాడు చిన్నపిల్లలను పట్టుకొని నా తండ్రిలాంటి కేసీఆర్ దగ్గరికి వచ్చాను. మా కుటుంబానికి తానున్నానని ఆనాడు కేసీఆర్ మాట ఇచ్చాడు. నీవు బాధ పడకమ్మా.. నీ పిల్లలను నేను చూసుకుంటా అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మా పిల్లలకు, మా కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉన్నారు. నా బిడ్డ మెడికల్ కాలేజీలో చదువుకు డబ్బులు ఇస్తున్నారు.

**- పద్మావతి, పోలీసు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య**

### మా నాన్న కల నెరవేరింది..



మేము ఆరో తరగతిలో ఉన్నప్పుడు మా నాన్న తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిండు. మాకు ఊహ తెల్వని సమయంలోనే నాన్న చనిపోయాడు. ఆ సమయంలో బాధపడొద్దు.. మీ కుటుంబానికి తాను అండగా ఉంటానని అప్పటి సీఎం కేసీఆర్ మాట ఇచ్చారు. ఇచ్చినట్లుగానే మమ్ములను చూసుకుంటున్నారు. చెల్లిని మెడిసిన్ చేయించారు. ఇప్పుడు పీజీ కోసం మళ్లీ డబ్బులు ఇచ్చారు. మా అమ్మకు తండ్రిలా కేసీఆర్ అన్ని విధాలా అండగా ఉన్నారు. మా నాన్న కల నెరవేరింది. కానీ మా మధ్య నాన్న లేకపోవడం బాధగా ఉన్నది.

**- రాహుల్, కిష్టయ్య కుమారుడు**

# ఓట్ల లెక్కింపునకు సిద్ధంగా ఉండాలి

**కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, సీపీ**




ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

డిచ్‌పల్లి, జూన్ 2: అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షించాలని, నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని ఎన్నికల అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. డిచ్‌పల్లిలోని సీఎంసీ కేంద్రాన్ని సీపీ కల్మేశ్వర్ సింగేనవార్‌తో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. కౌంటింగ్ హాళ్లలో టేబుళ్లు, బారీకేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరి చేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలన్నారు. ఎలాంటి అపశృతులకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ కల్మేశ్వర్ అన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# బడిబాట వాయిదా

ఖలీల్‌వాడి/కామారెడ్డి, జూన్ 2: విద్యాశాఖ ఆధ్వర్యంలో నేటి (సోమవారం) నుంచి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమం వాయిదా పడినట్లు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల విద్యాశాఖ అధికారులు దుర్గాప్రసాద్, రాజు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తారని పేర్కొన్నారు.





హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ తదితరులు ఉత్సవాలకు హాజరయ్యారు.

# టోల్‌బాదుడు షురూ

- 44వ జాతీయ రహదారిలో పెరిగిన టోల్‌గేట్ ఫీజు
- ఆర్టీసీ ప్రయాణికులపై అదనపు భారం

ఇందల్‌వాయి, జూన్ 2: టోల్‌ప్లాజాల వద్ద వాహనదారుల నుంచి వసూలు చేసే టోల్‌ఫీజు ధరల పెంపునకు రంగం సిద్ధమైంది. ప్రతి ఏడాది ఏప్రిల్ 1న టోల్ ధరలు 5శాతం పెంచుతుంటారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ధరల పెంపు ఈసారి తాత్కాలికంగా నిలిచిపోయింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు పూర్తవ్వడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచే పెంచిన టోల్ ధరలు అమలులోకి వచ్చాయి. హైదరాబాద్ మార్గంలో తూప్రాన్, కామారెడ్డి జిల్లా భిక్కనూర్, నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి, నిర్మల్ వద్ద ఉన్న టోల్ ప్లాజాల్లో చార్జీల పెంపును 3వ తేదీ ఉదయం నుంచి అమలు చేస్తున్నామని ఇందల్‌వాయి టోల్‌ప్లాజా మేనేజర్ వీరబాబు తెలిపారు. టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు చెందిన స్థానిక వాహనాల నెలవారీ పాసు ధరను రూ.330 నుంచి రూ.340కి పెంచారు. ఇక పెరిగిన టోల్ ఫీజుల భారాన్ని ఆర్టీసీ ప్రయాణికులపైనే వేస్తున్నది. ఆర్టీసీకి చెందిన వివిధ సర్వీసుల్లో ప్రయాణించే ఒక్కో ప్రయాణికుడిపై రూ.3 అదనపు భారం పడనున్నది.

**అతంగ్ టోల్ ప్లాజా ఇందల్‌వాయి వద్ద పెరిగిన టోల్‌ఫీజులు**

| వాహనం | సింగిల్ జర్నీ | రిటర్న్ జర్నీ | నెలవారీగా (పాత రేటు- కొత్తరేటు రూ.ల్లో) |
|---|---|---|---|
| కారు, జీపు, వ్యాన్, లైట్ మోటారు | 90–95 | 135–145 | 2965– 3200 |
| లైట్, కమర్షియల్, లైట్ గూడ్స్ | 140–150 | 210–230 | 4685– 5055 |
| బస్సు లేదా ట్రక్ | 290–315 | 435–470 | 9685– 10455 |
| హెవీ కన్‌స్ట్రక్షన్, ఎర్త్ మూవింగ్ | 450–485 | 675–725 | 14970–16155 |
| పెద్ద వాహనాలు | 560–605 | 845–910 | 18740– 20225 |




# ఉద్యమ స్ఫూర్తితో.. ప్రగతిబాటలో పయనిద్దాం

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

కంఠేశ్వర్, జూన్ 2: మలి విడుత ఉద్యమంలో జిల్లాకు చెందిన అనేక మంది ఉద్యమకారులు ఆత్మ బలిదానాలకు పాల్పడ్డారని, వారి త్యాగాలు వెలకట్టలేనివని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్.. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ అమరుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సంక్షేమం, విద్యా, వైద్యం, వ్యవసాయం తదితర అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని, ఇదే స్ఫూర్తితో జిల్లాను మరింతగా ప్రగతిబాటలో పయనింపజేసేందుకు కంకణబద్ధులై ఉన్నామన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. 4న నిర్వహించే ఎన్నికల కౌంటింగ్‌ను కూడా శాంతియుతంగా పారదర్శకంగా సజావుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి సమష్టితత్వంతో శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతకుముందు వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్మారకస్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



కలెక్టరేట్‌లో జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, చిత్రంలో ఎమ్మెల్యే ధన్‌పాల్, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు

# అమరుల త్యాగాలు మరువలేనివి

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 వసంతాలు పూర్తి చేసుకొని 11వ వసంతంలోకి అడుగిడుతూ ఉత్సాహ పూరిత వాతావరణంలో వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అమరుల ఆశయాలు,ఆకాంక్షల మేరకు రాష్ట్రాన్ని, జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. అంతకముందు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న అమరవీరుల స్థూపానికి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూ శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ కాజల్ సింగ్, అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





క్యాంపు కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్, పక్కన ఎస్పీ సింధూశర్మ, అదనపు కలెక్టర్లు